# 3

# ఇది అతని దారి

పేరు రామ్‌కుమార్. కానీ రావణాసురుడు. ఎప్పుడుచూసినా తుమ్మల్లో పొద్దుగూకినట్లు వుంటుందిట ఆ మొహం. ధుమధుమలాడుతూనే వుంటాడట. గుప్పెడు వొడ్లు మొహానజల్లితే బుట్టెడు పేలాలు వేగుతాయట. భార్యాపిల్లలున్నారు గానీ వాళ్ళు ఈయన దగ్గరుండరు. వంటరిగానే తిరుగుతుంటాడు. రిటైర్‌మెంట్‌కి ఇంకా అయిదేళ్ళుందిట.

వర్షం పడే ముందు ఈదురుగాలి వచ్చినట్లు కొత్తగా రాబోయే ఆఫీసరుగారి వివరాలు అన్నీ ముందుగానే తెలిసిపోతాయి. ఆ డివిజన్‌లో విద్యుత్ విభాగానికి కొత్తగా రాబోతున్న ఆఫీసరుగారి వివరాలు ఇవన్నీ.

ముందురోజు కబురొచ్చింది. ఆయన వస్తున్నాడని తెల్లవారుజామున పదిమంది స్టేషన్‌కి వెళ్ళారు ఆయనని ఆహ్వానించడానికి. అదో మర్యాద. ఆనవాయితీ. రైల్లోంచి దిగాడు రామ్‌కుమార్. ఆయన కంటే ముందుగా రైల్లోంచి దిగిన ప్యూన్ స్టేషన్‌లో కంపార్ట్‌మెంటు దగ్గర చేతిలో పూలదండతో నిలబడ్డ గుంపుకి వీరే వారు అని పరిచయం చేశాడు. దండ వేశారు. నమస్కారాలు పెట్టారు.

ఆ దండ తీసి ప్యూన్‌కి అందించి ముందుకు నడిచాడాయన. స్టేషన్ బయట వారి వాహనం డ్రైవర్‌తో సిద్ధంగా వుంది. అందులో ఎక్కి తిన్నగా గెస్ట్‌హౌస్‌కి వెళ్ళారు. అక్కడ ఈయన కోసం ఒక ఎయిర్ కండిషన్ గది. సపర్యలు చెయ్యడానికి ఒక మనిషి సిద్ధంగా వున్నారు.

"సార్! తొమ్మిదింటికి వచ్చి మిమ్మల్ని తీసికెళ్తాం" అని చెప్పి వెళ్ళిపోయారు అందరూ. కాఫీ, న్యూస్ పేపరూ వచ్చేశాయి. కాఫీ తాగి మరోగంట నిద్రపోయి లేచి తయారై పోయాడు. తొమ్మిదింటికి ఆఫీస్‌కి బయలుదేరాడు.

అక్కడ అంతా హడావిడిగా వుంది. అప్పటివరకూ ఆ పోస్ట్‌లో వున్న శ్రీనివాస్ అప్పటికే వచ్చేశాడు. ఈయన్ని సాదరంగా ఆహ్వానించాడు. ఇద్దరూ ఛాంబర్‌లోకి వెళ్ళారు. శ్రీనివాస్ తన కుర్చీలో కూర్చున్నాడు. ఎదురు కుర్చీలో రామ్‌కుమార్. స్టాఫ్ అంతా రూమ్‌లోకి వచ్చి ఇరుక్కునే నిలబడ్డారు.

సంతకాలు పెట్టారు ఇద్దరూ. శ్రీనివాస్ లేచి ఇవతలికొచ్చాడు. రామ్‌కుమార్ ఆ సీట్ దగ్గరికొచ్చాడు. మళ్ళీ ఇద్దరికీ దండలు వేశారు. చప్పట్లు కొట్టారు. తర్వాత స్వీటు హాటు కాఫీ అందరికీ ఇచ్చారు. స్టాఫ్‌ని పరిచయం చేశాడు శ్రీనివాస్. వాళ్ళదంతా ఫీల్డ్‌వర్క్. పదిశాతం మంది మాత్రమే ఆఫీసులో వుంటారు. అక్కడ ఈ సందడంతా ముగిశాక ఇద్దరూ డి.ఎం.గారి దగ్గరికి వెళ్ళారు. అక్కడ ఆయనే పెద్దతలకాయ. ఆయన పేరు కె.కె.గర్గ్. ఉత్తరాదివాడు. పూర్తి పేరు కిషోర్‌కుమార్ గర్గ్.

ఆదరంగా నిలబడి షేక్‌హాండ్ ఇచ్చాడు. "వెల్‌కమ్ టు మై టీమ్. మీ గురించి చాలా విన్నాం. మీరు ఇక్కడికి రావడం నాకు చాలా సంతోషంగా వుంది" అన్నాడు.

ఆ తర్వాత ఆఫీసర్స్‌తో మీటింగ్‌హాల్‌లో మీటింగ్ వుంది. ముగ్గురూ అక్కడికి వెళ్ళారు. మళ్ళీ పరిచయాలు. మళ్ళీ స్పెషల్‌గా కాఫీ టిఫిన్.

మధ్యాహ్నం క్లబ్‌లో లంచ్. వెళ్ళే ఆఫీసర్‌గారికి వీడ్కోలు. వచ్చినవారికి స్వాగతం పలుకుతూ ఉపన్యాసాలు. ఆ తర్వాత భోజనాలు.

అంతటితో ఒక లాంఛనం ముగిసిపోయింది. ఇక మర్నాటి నించీ రొటీన్. "మీకు ఇల్లు మరో నెల రోజుల్లో రెడీ అయిపోతుంది" అన్నాడు ఆ వ్యవహారాలు చూసే ఆఫీసర్.

"నాకు ఇల్లు అవసరం లేదు. నా ఫ్యామిలీ రాదు. నాకు ట్రాన్సిట్ ఎకామిడేషన్ ఇవ్వండి చాలు" అన్నాడు రామ్‌కుమార్. వెంటనే ట్రాన్సిట్ వసతి కల్పించారు.

ఒక గది. ముందు చిన్నవరండా. చిన్న వంటగది. ప్యూన్ వెంటనే వచ్చాడు. వండి పెడతాడు. రామ్‌కుమార్ సెటిల్ అయిపోయాడు.

పని ఎలా సాగుతోంది. ఎవరే పని చేస్తున్నారు. స్టాఫ్ స్వభావాలు ఎలా వున్నాయి. అతి వినయం ఎవరు చూపిస్తున్నారు? మాటలతో కోటలు కట్టే వాళ్ళెవరు? ఇవన్నీ చాలా త్వరగానే ఆకళింపు చేసేసుకున్నాడు.

ఎవరితోనూ పెద్దగా కలవడు. పొద్దున క్లబ్‌కెళ్లి షటిల్ ఆడతాడు. ఆఫీస్ అయ్యాక ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదువుకుంటాడు. టి.వి. చూస్తాడు. వారాంతంలో ఊరికి వెళ్ళి ఫ్యామిలీని చూసి వస్తాడు అంతే.

రాసుకు పూసుకు తిరిగే మిత్రుత్వమూ లేదు. మొహం చూడనంతటి శత్రుత్వమూ లేదు. తటస్థంగా వుంటాడు అందరితోనూ. ఇక పని విషయానికొస్తే మెరిక. ఎవరూ వేలెత్తి చూపే అవకాశం లేదు. తాను హైరానాపడి ఎదుటి వాళ్ళను హైరానా పెట్టడు. అలవోకగా చేసుకుపోతాడు ఎంత కష్టమైన పనైనా.

ఒకరోజు రామ్‌కుమార్ దగ్గరికి ఒక పేపరు వచ్చింది. ఆ ఏడాది అన్ని డిపార్ట్‌మెంట్స్‌లోను అత్యంత ప్రతిభ కనబరిచిన కార్మికుల జాబితా అది. వారికి అవార్డులిస్తారు.

ప్రతి ఏటా ఆ కార్యక్రమం జరుగుతూనే వుంటుంది. అందులో మూడు రకాలు. ఇక్కడ చాలా మందికి ఇస్తారు. మరికొంతమందికి రాష్ట్రస్థాయిలో, హైదరాబాదులో జోనల్ ఆఫీస్‌లో జరిగే ఫంక్షన్‌లో అవార్డు లిస్తారు. ఇంకా ప్రతిభావంతులకి జాతీయ స్థాయిలో ఢిల్లీలో అవార్డు లిస్తారు.

ఓపిగ్గా చదివాడు రామ్‌కుమార్. అతని నొసలు ముడిపడ్డాయి. తన డిపార్టుమెంట్ వాళ్ళకి ఊరుదాటి వెళ్ళే అవకాశం రాలేదు. ఇక్కడే అవార్డులు పుచ్చుకోవాలి. స్టెనోని పిలిచి కొన్ని పాత ఫైళ్ళు తెప్పించి క్షుణ్ణంగా పరిశీలించాడు. మరికొన్ని వివరాలు అడిగి తెలుసుకున్నాడు. విషయం అర్థం అయింది. ఇక ఆ సంగతి పక్కన పడేశాడు.

మరుసటి నెలలో అర్జెంట్‌గా ఆఫీసర్ల మీటింగ్ పెట్టాడు డి.ఎం. మినిస్టర్‌గారు ఈ నెల్లోగానీ పై నెల మొదటివారంలో గానీ ఈ ప్రాంతానికి ఇన్‌స్పెక్షన్‌కి వస్తారు. డేట్ ఇంకా తెలియదుగానీ వస్తారు. కాబట్టి తస్మాత్ జాగ్రత్త అన్నాడు.

అన్ని డిపార్ట్‌మెంట్ల వాళ్ళూ మినిస్టర్ విజిట్‌కి సిద్ధం అయిపోతున్నారు. రామ్‌కుమార్ తన ఛాంబరుకొచ్చాడు. స్టెనోని పిల్చి ముగ్గురి పేర్లు చెప్పాడు. ఈ

ముగ్గుర్నీ అర్జెంటుగా నా ఎదుటికి రప్పించండి అన్నాడు. ఆ ముగ్గురూ క్లాస్‌ఫోర్ ఉద్యోగులు. వాళ్ళు ఎప్పుడూ కాకుల్లా బయట తిరుగుతూనే వుంటారు. వాళ్ళకి ఈ ఈ ఆఫీసుకి రావలసిన అనవసరంగానీ అవకాశంగానీ వుండవు. మరి ఇప్పుడు ఈయనకి వాళ్ళతో ఏం పనా? అని ఆశ్చర్యపోయాడు స్టెనో. ఆయన ఆజ్ఞ అయింది కాబట్టి మర్నాడు పొద్దుటికి వాళ్ళు ముగ్గురినీ తలో మూలనా వుంటే వెతికి పట్టుకుని రప్పించి ఆఫీసరుగారి ఎదుట నిలబెట్టాడు.

బాలక్రిష్ణ, సత్యరాజన్, నరసింహులు.

వాళ్ళు ముగ్గురికీ గొంతెండి పోతోంది. ఏదో పనిముట్లు అన్నీ వున్న సంచీ చేత పట్టుకుని ఎక్కడ రిపేరొస్తే అక్కడికి పరుగులు పెట్టడం, రిపేర్లు చెయ్యడం అదే వాళ్ళ పని. ఇలా ఆఫీసులకొచ్చి ఏసీ గదుల్లో కూర్చున్న ఆఫీసరు గార్ల దగ్గరికి ఎప్పుడూ రాలేదు. వంగి వంగి దణ్ణాలు పెట్టారు. ప్రతి నమస్కారం చేశాడు రామ్‌కుమార్.

కూర్చోమన్నాడు. వాళ్ళు తెగమొహమాట పడిపోయారు.

పరిశీలనగా చూశాడు వాళ్ళ ముగ్గురి వంకా. ఎండా వానా అనకుండా ఆరుబయట తిరుగుతూ విధులు నిర్వహిస్తారు. కాబట్టి వాళ్ళ మొహాలు మాడిపోయి వున్నాయి. చేతులు మొరటుదేలి పోయాయి. అసలు వయసు కంటే పదేళ్ళు ఎక్కువ వున్నట్లు కనిపిస్తున్నారు.

"మీరెక్కడుంటున్నారు. ఏ ఊరు? పిల్లలెంతమంది? ఈ ఉద్యోగంలో ఎన్నాళ్ళుగా వున్నారు వగైరా ప్రశ్నలు వేశాడు. అన్నింటికీ వినయంగా సమాధానం చెప్పారు.

"మీతో ఓ విషయం చెప్పాలని పిలిపించాను. మీరో పని చెయ్యాలి" అన్నాడు.

"చెప్పండి సార్" ముక్తకంఠంతో అన్నారు ముగ్గురూ.

"ఈ నెల 25వ తారీఖు నుండి వచ్చేనెల పదవ తారీఖు వరకూ మీరు ముగ్గురూ సెలవు పెట్టండి".

వాళ్ళకేం అర్థం కాలేదు. వాళ్ళే జన్మానా సెలవు పెట్టలేదు. అత్యవసర సేవలందించే ఉద్యోగం వాళ్ళది. ఎప్పుడు కబురొస్తే అప్పుడు వెంటనే పరిగెట్టడం మాత్రమే తెలుసు. ఆఫీసరు గారు అలా అడిగేసరికి అయోమయంగా అనిపించింది.

ఎదురు తిరిగి ప్రశ్నలు వేయడానికి భయం వేసింది. వెర్రిమొహాలు వేసుకుని నిలబడ్డారు. "మీకు రాయటం వచ్చా?" అడిగాడు రామ్‌కుమార్.

వచ్చునని తలాడించారు. ముగ్గురికీ మూడు తెల్ల కాయితాలు ఇచ్చి నేను చెప్పినది రాయండి. అని ఓ లీవ్‌లెటర్ డిక్టేట్ చేశాడు. వాళ్ళని సంతకాలు పెట్టమని చెప్పాడు. వాళ్ళు సంతకాలు పెట్టాక అవి తీసుకుని "లీవ్ శాంక్షన్" అని రాసి ఫైల్ చేశాడు. ఇక మీరు వెళ్ళచ్చు. ఈ రోజుల్లో మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్యూటీకి రావద్దు. ఇంట్లోనే వుండండి. ఎవరైనా రమ్మంటే సెలవులో వున్నాం అని చెప్పండి.

"ఏం అర్థం అయిందా? నేను చెప్పినట్లు చెయ్యాలి?" కాస్త కఠినంగానే చెప్పాడు.

చిత్తం అంటూ తలాడించారు ఆ ముగ్గురూ. "వెళ్ళండి" అని ఆయన చెప్పగానే వెనక్కి తిరిగారు. "మాట. ఇక్కడ జరిగిన విషయం ఎవరితోనూ చెప్పద్దు" వెనకనించీ వినిపించింది ఆఫీసర్‌గారి కంఠం.

మరో నాలుగు రోజులు గడిచాయి. మంత్రిగారి ప్రోగ్రాం తారీఖులు నిర్ణయం అయిపోయాయి. మంత్రిగారి ప్రోగ్రామ్ అంటే సామాన్యమా? ఆయన వెంట బోలెడు మంది ఆఫీసర్లొస్తారు. అణువణువూ క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఏ మాత్రం తేడా వచ్చినా మంగళాష్టకాలు తప్పవు. చాలా జాగ్రత్తగా ఉండాలి.

అందుకే వెంటనే మీటింగ్ ఏర్పాటు చేశారు డి.ఎం.గారు. అన్ని డిపార్ట్‌మెంట్ల వాళ్ళను హెచ్చరించారు. మీ మీ కింద పనిచేసే మెరికల్లాంటి మనుషులందర్నీ రంగంలోకి దింపండి. ఎవరిపని వాళ్ళు ఏ లోపం రాకుండా చేసుకోండి. ఏమైనా సమస్యలుంటే నాతో మాట్లాడండి. అర్ధరాత్రి అయినా ఫోన్ చెయ్యడానికి వెనకాడవద్దు అని చెప్పాడు. అందరూ తలలూపారు. పనులన్నీ పర్యవేక్షించడానికి అందులోంచి ఓ ఆఫీసర్‌ని ఎంపిక చేశాడు. అతని పేరు వినోద్.

అలాంటి వి.వి.ఐ.పి. విజిట్స్ ఏడాదికోసారి జరుగుతూనే వుంటాయి. కొత్తేం కాదుగానీ జాగర్తగా వుండాలి. గతంలో ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళు చేశాను కదా అని నాలుగో పిల్ల పెళ్ళిని ఆషామాషీగా తీసుకోడు కదా ఆడపిల్ల తండ్రి! ఇదీ అంతే. ఎప్పటికప్పుడే జాగర్త పడతారు. ప్రయత్నాలు మొదలు పెడతారు.

ఏర్పాట్ల కోసం మీ డిపార్ట్‌మెంట్ నించీ మెరికల్లాంటి పనివారిని ఎంచి పంపమని అన్ని డిపార్ట్‌మెంట్ల వారికీ తెలియజేశారు. అందరూ వెంటనే పంపిస్తాం అంటూ సమాధానం ఇచ్చారు.

రామ్‌కుమార్ మాత్రం నిమ్మకి నీరెత్తినట్లు వూరుకున్నాడు. అదేవిటి మీ దగ్గర్నించీ లిస్ట్ రాలేదేం అంటే ఇదుగో ఇప్పుడే పంపిస్తున్నా అని ఓ నాలుగు పేర్లు రాశాడు. మీరెప్పుడు పంపించమంటే అప్పుడు వాళ్ళని పంపిస్తాను అని చెప్పాడు.

అలాగే పంపించాడు కూడాను. వాళ్ళకి ఏ పనీ రాదు. చెప్పింది చేస్తారంతే. స్వంత తెలివితేటలు లేవు.

వినోద్ రామ్‌కుమార్‌కి ఫోన్‌చేసి "ఇదేవిటండీ? ఈ శాల్తీలని పంపించారూ? వీళ్ళు ఉత్తమొద్దులు" అన్నాడు.

"అవును వినోద్. ఆ మాటకొస్తే నా డిపార్ట్‌మెంటులో అందరూ మొద్దులే పనొచ్చిన వాళ్ళెవరూ లేరు" అన్నాడు రామ్‌కుమార్. "నవ్వేశాడు వినోద్. ఈ జోకులకేం లెండి త్వరగా పంపించండి" అనేశాడు. రామ్‌కుమార్ దగ్గర్నించీ ఎటువంటి స్పందనా లేదు. మరో రెండుసార్లు ఫోన్ చేసినా అదే సమాధానం.

వినోద్‌కి విసుగేసింది. అవతల మిగిలినవారందరి పనులూ చకచక సాగుతుంటే కరెంటు వారి పని కుంటుపడుతోంది. డి.యం.తో ఈ మాట చెప్పాడు.

డి.యం. గర్గ్ రామ్‌కుమార్‌ని పిలిపించాడు.

"ఏవిటిది? మీరు మనుషులని పంపలేదుటగా! వినోద్ గోల పెడుతున్నాడు!" అన్నాడు.

"అదేమిటి సార్. వినోద్ అడగ్గానే పంపించాను ఏం వినోద్?" ఆయన ఎదురుగానే అడిగాడు. "పంపించారు. వాళ్ళుత్త పనికిమాలిన వాళ్ళు!" చెప్పాడు వినోద్.

"దానికి నేనేం చెయ్యను సార్? మిగిలిన డిపార్ట్‌మెంట్స్‌తో పోల్చుకుంటే మా వాళ్ళంతా మామూలు వాళ్ళు. వాళ్ళకున్నంత వర్క్ నైపుణ్యం మా వాళ్ళ దగ్గర లేదు. అప్పటికీ వున్న వాళ్ళలో మంచివాళ్ళని ఎంచి పంపించాను"... సంజాయిషీ ఇచ్చాడు రామ్‌కుమార్.

"అదేవిటండీ అలా అంటారు! మీ డిపార్ట్‌మెంట్‌లో మెరికల్లాంటి వాళ్ళుంటేను? నిజం చెప్పాలంటే మిగిలిన అన్నిచోట్ల కంటే మీ దగ్గరే. మంచి వర్కర్లు వున్నారు".

"ఏదో నన్ను సంతోష పెట్టాలని అంటున్నారు గానీ నా దగ్గరెవరూ లేరు. వున్న వాళ్ళను పంపించేశాను మీ దగ్గరికి" తన మాట మీదే నిలబడ్డాడు రామ్‌కుమార్.

"ఆయన పంపించానంటున్నాడుగా వాళ్ళతో పని జరిపించండి" అన్నాడు గర్గ్. ఆయనకింకా బోలెడన్ని పనులున్నాయి. సణుక్కుంటూనే వెళ్ళిపోయాడు వినోద్. పంతానికిపోయి పని గడిపేద్దాం అనుకున్నాడు గానీ వీలవలేదు.

మర్నాడు మీటింగ్‌లో అందరిముందూ ఈ అంశం లేవనెత్తాడు. "అందరూ కోపరేట్ చేస్తున్నారు గానీ రామ్‌కుమార్ పేచీ పెడుతున్నాడు" అన్నాడు.

రామ్‌కుమార్ వెంటనే గళం విప్పాడు. "నేనూ కొత్తగా వచ్చాను. నాకు తెలిసినంతలో మంచివాళ్ళనే ఎంచి పంపించాను" అన్నాడు. అందరూ మొహాలు చూసుకున్నారు.

"అదీ అసలు విషయం. పాపం ఆయనకేం తెలుసు? చూడండీ డిపార్ట్‌మెంట్లో ముగ్గురు మెరికల్లాంటి వర్కర్లున్నారు. బాలకృష్ణ, సత్యరాజన్, నరసింహులు. పనిలో వాళ్ళని మించిన వాళ్ళు లేరు" అన్నాడు ఆఫీసరు.

"అవును. మీరు రొటీన్‌గా పంపేవాళ్ళని పంపమని చెప్పేస్తే మీకింది వాళ్ళు వాళ్ళని పంపేసేవాళ్ళు. వాళ్ళ గురించి అందరికీ తెలుసు" అన్నాడు మరో ఆఫీసరు.

"వాళ్ళా? వాళ్ళు లీవ్‌లో వున్నారు" తాపీగా చెప్పాడు రామ్‌కుమార్. అందరూ ఆశ్చర్యపోయారు.

"అదేవిటీ? ముగ్గురూ ఒకేసారి లీవ్‌లో వెళ్ళారా? ఎవరిచ్చారు?" అడిగాడు ఆఫీసరు.

"నేనే ఇచ్చాను. వాళ్ళు చాలా ఏళ్ళుగా లీవ్ తీసుకోలేదు".

"అదెలా ఇచ్చారు? ఎదురుగా మినిస్టర్ ప్రోగ్రామ్ వుంటే మంచి వర్కర్స్‌కి సెలవెలా శాంక్షన్ చేశారు?" నిలదీశాడు వినోద్.

"ఆ! గుడ్డికన్ను మూస్తే ఎంత తెరిస్తే ఎంత అని వాళ్ళకి లీవ్ ఇచ్చేశాను".

అతని వాలకం చూస్తుంటే చిరాకేస్తోంది వినోద్‌కి.

"మీరు కొత్తగా వచ్చారు. ఒప్పుకున్నాం. మామూలుగా ఇటువంటి సమయానికి ఎవరి అవసరం ఎంత వుంటుందో తెలుసుకోవాలని చిన్న విషయం తెలియదా?"

"క్షమించండి వినోద్. నా పద్ధతి వేరు. నేను ఏ విషయం తెలుసుకోవాలన్నా కాయితాల ద్వారానే తెలుసుకుంటాను. ఇప్పుడూ అలాగే తెలుసుకున్నాను. పాత ఫైళ్ళన్నీ క్షుణ్ణంగా తిరగేశాను.

నా డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న స్టాఫ్‌కి ఎప్పుడూ ఏ అవార్డులూ రాలేదు. జాతీయ స్థాయిలో వదిలెయ్యండి. మామూలుగా వచ్చే అవార్డులు కూడా చాలా తక్కువ మందికే వచ్చాయి. అలా వచ్చిన ముగ్గురినీ ఎంచి మీకు పంపించాను. మీరడిగారని అవార్డులొచ్చిన వాళ్ళ లిస్ట్ తిరగేశాను. మరి మీరందరూ ముక్తకంఠంతో చాలా గొప్ప పనివాళ్ళని మెచ్చుకుంటున్న బాలక్రిష్ణ, సత్యరాజన్, నరసింహులు వీళ్ళ ముగ్గురి పేర్లూ ఎక్కడా సోదిలో కూడా లేవు. ఇక వాళ్ళెంత గొప్పవాళ్ళో నాకెలా తెలుస్తుంది?

పని విషయంలో ప్రజాభిప్రాయమూ, అవార్డుల విషయంలో కాయితాల మీద రికమెండేషన్లు, పరిగణనలోకి తీసుకునే పద్ధతంటే నాకు పరమ చిరాకు. ఏదో ఒకటే ఎంచుకోవాలి. ఇప్పుడూ అలానే ఎంచుకున్నాను. ఏ అవార్డుకీ అర్హులు కాని నా స్టాఫ్ నా దృష్టిలో పనికిరానివాళ్ళే" రామ్‌కుమార్ సమాధానం విని గర్గ్ మొహాన నీళ్ళు కొట్టినట్లు అయింది. మిగిలిన వాళ్ళంతా ఇబ్బందిగా కదిలారు.

"ఇక ఇక్కడ నాకేం పనిలేదు. నేను వెళ్తున్నా" అంటూ లేచాడు రామ్‌కుమార్. వాకిలిదాకా వెళ్ళి వెనక్కి తిరిగాడు. "బై ది బై రేపు మంత్రిగారి ప్రోగ్రామ్‌లో మంచి పని వారిని ఎంచి వారి చేతుల మీదుగా పురస్కారాలు ఇప్పిస్తారు కదా! ఆ లిస్ట్ ఫైనల్ అయిందా? నా డిపార్ట్‌మెంట్‌లో ఎవరి పేరైనా ఆ లిస్ట్‌లో వుంటే నాకు చెప్తే వాళ్ళకి లీవ్‌లు ఇవ్వను. అఫ్‌కోర్స్ అలావుంటే మీరు నాకు లెటర్ పంపిస్తారనుకోండి. వూరికే గుర్తు చేస్తున్నా" అనేసి తలుపు తీసుకుని వెళ్ళిపోయాడు. కాసేపు హాల్లో అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"ఇది మరీ బావుంది. పనికీ అవార్డులకీ లంకె పెడితే ఎట్లా? పనికి జీతాలిస్తున్నారు. అవార్డు రావాలంటే మరి అందరూ ఒప్పుకోవాలి. వంద మందిలో ఒక్కరికే వస్తుంది అవార్డు" అన్నాడు వినోద్.

"ఈయన మహా మొండివాడట. అందుకే ఇన్ని ట్రాన్స్‌ఫర్లూ గొడవానూ! ఎక్కడా ఓ ఏడాది స్థిరంగా ఓ చోట వుంచరుట" అన్నాడు మరో ఆఫీసరు.

"ఆ ముగ్గుర్నీ లీవ్ కేన్సిల్ చేసి పిలిపించమని లెటర్ ఇవ్వండి" సలహా చెప్పాడు మరో పెద్దమనిషి.

గర్గ్ మాత్రం ఏం మాట్లాడలేదు. మీటింగ్ ముగించి తన ఛాంబర్‌కి వెళ్ళిపోయాడు. రామ్‌కుమార్ ఫైల్ తెప్పించి తిరగవేశాడు.

ఇతనో విభిన్నమైన వ్యక్తి.

స్వప్రయోజనం కోసం ఉద్యమం లేవనెత్తే స్వార్థపరుడు కాడు.

నిస్వార్థంగా తన వారికి మంచి జరగాలని కోరుకునే నిజమైన నాయకత్వ లక్షణాలు కలిగినవాడు. ఇటువంటి వారితో మంచిగా నడుచుకోవడమే మంచిది. కోరి వైరం తెచ్చుకోవడం ప్రమాదం.

ఆ నిర్ణయానికి వచ్చాక మంత్రిగారి చేత అవార్డులు ఇప్పించేవారి లిస్ట్ తెప్పించాడు. అందులో వాళ్ళ ముగ్గురిపేర్లు లేవు. బాలక్రిష్ణ, సత్యరాజన్, నరసింహులు వాళ్ళ పేర్లు మూడు లిస్ట్‌లో పైన రాసి మళ్ళీ ఫ్రెష్‌గా తయారు చేసి తెమ్మని పురమాయించాడు.

రామ్‌కుమార్‌ని తన దగ్గరికి రమ్మన్నాడు. వెంటనే వచ్చాడతను.

"మీ స్టాఫ్‌కి అవార్డులిస్తున్నాం. వాళ్ళ లీవ్ కేన్సిల్ చేయించండి" అని లిస్ట్ స్వయంగా అందించాడు.

"మీరన్నమాట నాకు నచ్చింది. మీరు చాలా సిన్సియర్ ఆఫీసర్. మీ వంటి వారు హెడ్‌గా వుంటే ఆ డిపార్ట్‌మెంట్ బాగుపడుతుంది" అని మెచ్చుకున్నాడు.

"అదేం లేదు సార్. యోగ్యులైన వారికి ప్రోత్సాహం అందించాలని నా తాపత్రయం" అన్నాడు రామ్‌కుమార్.

తన రూమ్‌కి వెళ్ళి బాలక్రిష్ణ, సత్యరాజన్, నరసింహులు ముగ్గుర్నీ పిలిపించి డ్యూటీలో జాయిన్ అవమన్నాడు. వినోద్ దగ్గరికి పంపించాడు. వాళ్ళు యథాప్రకారం పనంతా నెత్తిన వేసుకున్నారు. మంత్రిగారి ప్రోగ్రాం బాగా జరిగింది. ఆయన చేతుల మీదుగా బాలక్రిష్ణ, సత్యరాజన్, నరసింహులు అవార్డులు అందుకున్నారు.

అంతేకాదు ఆ ఏడు హైదరాబాద్‌లోనూ పురస్కారాలు వచ్చాయి వాళ్ళకి. ఆ తర్వాత రామ్‌కుమార్ డిపార్టుమెంట్లో చాలామందికి అవార్డులొచ్చాయి. ఢిల్లీలో కూడా.

ఆ మరుసటి నెలకి రామ్‌కుమార్‌కి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. ఆ వేల్టికి అతనా ఊరొచ్చి ఆరు నెలలు. అంత సీనియర్ ఆఫీసర్ని ఆరు నెలల్లోగా అకారణంగా ట్రాన్స్‌ఫర్ చెయ్యడానికి రూల్స్ అంగీకరించవు. అందుకే అంతవరకు ఆగారు. ఆ తర్వాత అతనికి సెండాఫ్ అంతా రొటీన్‌గా జరిగిపోయింది.

పని వాడిని వెంటబెట్టుకుని తనకున్న కొద్ది సామాను సర్దుకుని స్టేషనుకొచ్చాడు రామ్‌కుమార్.

అతని స్టాఫ్‌లో చాలామంది స్టేషనుకొచ్చారు.

"సార్! ఇదే పని ఎన్నో ఏళ్ళుగా చేస్తున్నా మాకెప్పుడూ అవార్డులు రాలేదు. మీరొచ్చారు మాకు కూడా గుర్తింపు వచ్చింది సార్. మీరింకా కొన్నేళ్ళుంటే మా అందరికీ ఇంకా మంచి జరిగేది సార్. ఇంత త్వరగా వెళ్ళిపోతున్నందుకు బాధగా వుంది" అన్నారు, కృతజ్ఞతతో కళ్ళ నీళ్ళ పర్యంతం అవుతూ.

చిన్నగా నవ్వి వాళ్ళ భుజం తట్టాడు రామ్‌కుమార్.

రైలొచ్చింది. అందులో ఎక్కాడు. కదులుతున్న రైల్లో మరో ఊరికి ప్రయాణం అయ్యాడు. సంచారిలా తిరగటం అతని కలవాటే. అతని స్వభావం కారణంగా ఎక్కడా స్థిరంగా వుంచరు.

ఓ విధంగా ఆలోచిస్తే రామ్‌కుమార్ లాంటివాళ్ళు ఒకచోట పాతుకుపోయి వుండే కంటే పదిచోట్ల తిరిగితేనే మంచిది.

మరో పదిమందికి మంచి జరుగుతుంది. ❑

*నవ్య, 3 అక్టోబరు 2012*